
ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023

5

పార్వతీపురం మన్యం



స్కిల్ కాలేజీలో ప్రవేశాలకు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

యువతలో నైపుణ్యాలను మెరుగుపర్చి వారి ఉపాధికి బాటలు వేసేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అడుగులు వేస్తోందని, టూరిజం అండ్ హాస్పిటాలిటీ/రంగంలోని వివిధ విభాగాల్లో తిరుపతి జిల్లా స్కిల్ కాలేజ్‌లో శిక్షణకు ఎంపిక నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీడీయూజీకేవై, సీడాప్, ఎపి ఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వసతి, భోజనంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామన్నారు. తరగతులు పూర్తయ్యాక సర్టిఫికెట్, ఉపాధి ఇవ్వడం జరుగతుంది. ఇంటర్మీడియట్, ఐటిఐలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 25 ఏళ్ల వయసు గల యువత అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు 9676965949, 9703696328 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

మన్యంలో ముసురు... రైతుల్లో గుబులు

జిల్లాలో పలుచోట్ల జల్లులు ● అన్నదాతలకు తప్పని కష్టాలు

మన్యంలో శుక్రవారవారం వేకువజాము నుంచి ముసురు ప్రారంభమైంది. దీంతో ఆరుగాలం కష్టించి పంటలు చేతికందేసరికి నీటిపాలవుతుందేమోనన్న రైతుల్లో గుబులు పట్టుకుంది. ఇప్పటికే జిల్లాలో అక్కడక్కడ పండిన వరిచేలు కోతలయ్యాయి. పొలాల్లో ఉన్న పంటను కాపాడుకొనేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/కలెక్టరేట్

అకాల వర్షం కారణంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఇప్పటికే మొదలైన వరి పంట తడవగా, కొన్నిచోట్ల అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కూడా తడిసే ప్రమాదం పొంచి ఉందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో కోసిన పంట తడిసింది. అకాల వర్షాలు కారణంగా చేతికి అందిన పంట తడిసే అవకాశం ఉండడంతో రైతులు ధాన్యాన్ని టార్పాలిన్లుతో కప్పి కాపాడుకుంటున్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం, పెదబొండపల్లి, బందలుప్పి, ములగ, తాళ్లబురిడి, డోకిశిల, డికెపట్నం, నర్సిపురం, అడ్డాపుశీలకు చెందిన రైతులు వరికోతలు ముగించుకుని పంటను ఇంకా పొలాల్లోనే ఉంచారు. రెండురోజులుగా అలముకున్న తుఫాన్ వాతావరణంతో పంటను రక్షించుకోవడానికి కొన్నిచోట్ల నూర్పిడిచేసి కుప్పలుగా పోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. అరకొరగా ఉన్న టార్పాలియన్లను ధాన్యం బస్తాలపై కప్పకోవడానికి హైరానా పడుతున్నారు. ఈ ఏడాది ముందుస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని నమ్మబలికిన అధికారుల నుంచి అటువంటి చర్యలు ఏమీలేకపోవడంతో విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ధాన్యం నూర్పిడికి అవసరమైన టార్పాన్లను సబ్సిడీపై అందజేసేవారు. కనీసం ధాన్యం కాపాడుకోవడానికి టార్పాన్లను సరఫరా చేయని ఆర్‌బికెలు ఎందుకుని రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వాతావరణం అనుకూలించే దాకా రైతులు కోతలు కోయొద్దని, కోసిన ధాన్యాన్ని కుప్పలుగా ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు ఇస్తున్నారు.



పార్వతీపురం : నూర్చిన ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పతున్న రైతు



కోసిన వరిచేనును దిబ్బలు పెట్టే పనిలో రైతులు

ఆకాశంలో మబ్బులు... రైతుల్లో గుబులు

వీరఘట్టం: మండలంలోని శుక్రవారం ఉదయం నుండి ఆకాశంలో మబ్బులు ఏర్పడడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. గత మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి కానరావడంతో అన్నదాతలు మరింత భయభ్రాంతులకు గురవుతున్నారు. చేతికి అంది వచ్చిన పంట మరో కొద్ది రోజుల్లో చేతికొస్తుందన్న తరుణంలో వాతావరణంలో ఒక్కసారి మార్పు రావడం వల్ల ఆశలు అడియాసలు అవుతున్నాయని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి కానరావడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని వాపోతున్నారు.

వాతావరణ మార్పులతో రైతన్నల ఆందోళన

పాచిపెంట: వాతావరణంలో ఒక్కసారిగా మబ్బులు ఏర్పడి శుక్రవారం ఉదయం పొగ మంచుతో పాటు చిరుజల్లులు పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట యంత్రాల సహాయంతో కోతలు కోసి పంట పొలాల్లో చేళ్లు ఆరబెట్టి ఉన్నాయి. ఈ దశలో పడుతున్న చిరుజల్లులకు చేతికి అందిన పంట తడిసిపోయి రైతు తీవ్ర నష్టాన్ని కలుగుతుంది. చిరుజల్లులు ప్రస్తుతం కురవడంతో రైతులు కూలీలు సహాయంతో కోతలు కోసిన వరి చేను మడిలోనే కుప్పలుగా వేసి టార్పాన్లు పనులు కప్పుతున్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు

విద్యారంగ సమస్యలపై పోరుబాట

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన దీక్షలు ●యుటిఎఫ్, టిడిపి నాయకుల మద్దతు

ప్రజాశక్తి -పార్వతీపురం

విద్యారంగంలో నెలకొన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పోరుబాటు పట్టింది. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు చేపట్టిన దీక్షలను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్ పావని ప్రారంభించారు. దీక్షలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ తదితరులు మద్దతు తెలిపారు. దీక్షలను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ నాయకులు పావని మాట్లాడుతూ ఈమాట్లాడుతూ విద్యారంగంలో విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలతో పాటుగా జిల్లాలో పిజి కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విద్యావ్యవస్థ పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని, జిల్లాల విభజన పట్ల ఉన్న శ్రద్ధ జిల్లాలో విద్యాభివృద్ధిపై లేవని విమర్శించారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో పిజి సెంటర్ లేకపోవడం చాలా అన్యాయమని, దీనివల్ల విద్యార్థులపై చదువులకై ఇతర ప్రాంతాలకు వెళ్లలేక చదువులు డిగ్రీ తోనే ఆపివేసే పరిస్థితి నెలకొందని అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మౌళిక సదుపాయాలు కల్పించకపోవడం చాలా దౌర్భాగ్యమని వాపోయారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే స్థానిక సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యుటిఎఫ్ నాయకులు తోట రమేష్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతలా కుతలం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఇపిని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసి విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని అన్నారు. 117 జీవో ను రద్దు చేసి, పాఠశాలల విలీనం ఆపాలని డిమాండ్ చేశారు.

దీక్షలకు మద్దతు తెలిపిన బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఈ సమాజాని మార్చే శక్తి ఒక్క విద్యార్థి యువతకే ఉందని, అందరూ ఐక్యంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలని అన్నారు. పట్టణంలో మెరుగైన ఉన్నత విద్యాసంస్థలు లేకపోవడం చాలా దారుణమని, రాబోయే రోజుల్లో కచ్చితంగా పట్టణ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి తోనే దేశం, ప్రాంతం అభివృద్ధి ముడిపడి ఉందని, అందుకోసం విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు విద్యార్థుల పోరాటానికి ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్, నాయకులు అఖిల్, సిసింద్రీ, దేవిడ్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

67వ రాష్ట్ర స్థాయి అర్చరీ పోటీలను సీతానగరం మండలం జోగింపేటలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాదికారి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషను ప్రెసిడెంటు యన్. ప్రేమకుమార్ తెలిపారు. నవంబరు 25 నుంచి 27 వరకు మూడురోజులు నిర్వహించే ఈ పోటీలు ఈనెల25న శనివారం ఉదయం సీతానగరం మండలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, జోగింపేటలో ఉదయం 10గంటలకు ప్రారంభవుతాయని తెలిపారు. 14,17,19 ఏళ్లలోపు వారికి నిర్వహించే ఈ ఆర్చరీ గేమ్స్‌నకు రాష్ట్ర వ్యాప్తంగా గల పాఠశాలల నుంచి బాలురు, బాలికలు హాజరౌతారని తెలిపారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

జోగింపేట పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూర్యదేవుడు, ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు అండగా ఉంటాం

రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు డిసెంబర్ 8నుంచి చేపట్టనున్న సమ్మెకు అండగా ఉంటామని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పారు. తెలంగాణా కంటే ఎక్కువ జీతం ఇస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. గడచిన నాలుగేళ్లలో వారి జీతం వెయ్యి రూపాయలు ప్రభుత్వం పెంచింది కానీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పెంచలేదని చెప్పారు. అంగన్వాడీలకు ఉన్న హక్కులను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాసే ప్రయత్నంలో ఉన్నాయని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. గతంలో సరుకులను కేంద్రాలకు ప్రభుత్వమే సరఫరా చేసేదని, కానీ ఇప్పుడు కార్యకర్తలకే సరుకులు రవాణా బాధ్యతలు అప్పగించారని చెప్పారు. గతంలో మినీ అంగన్వాడీ కేంద్రాలు 400 జనాభాకు ఒకటి చొప్పున వుండేదని చెప్పారు. ఇప్పుడు వెయ్యి జనాభా దాటినా మినీ అంగన్వాడీ కేంద్రాలు గానే వాటిని ఉంచారని చెప్పారు. దీనివల్ల మినీ అంగన్వాడీ కార్యకర్తలపై విపరీతమైన పనిభారం పడుతున్నదని చెప్పారు. హెల్పర్ ఇచ్చే వేతనంతో అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ ఉద్యోగాలను చేయాల్సి వస్తోందని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.ఐదు లక్షలు చెల్లించాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు సంబంధించిన వయోపరిమితిని 50ఏళ్లకు పెంచాలని కోరారు. రాజకీయ జోక్యం నివారించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంగన్వాడీల సమస్యల్ని పరిష్కరించడానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కనీసం చర్చలకు అవకాశం ఇవ్వడం లేదని చెప్పారు. ఆందోళలపై అణిచివేత ధోరణి అవలంభిస్తుండడం అన్యాయమని అన్నారు. డిసెంబరు 8 నుంచి చేపట్టనున్న సమ్మెకు ముందుగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాలకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని ఉమామహేశ్వరి కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య, సిపిఐ నాయకులు సిద్దాబత్తుల రామచంద్రరావు, జనసేన నాయకులు శివకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, పాచిపెంట సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు గాసి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ పాచిపెంట ప్రాజెక్టు అధ్యక్షులు టి.ప్రభావతి, కార్యదర్శి దాలమ్మ, మండల యూనియన్ నాయకులు శశికళ, ఎ.నారాయణమ్మ, పట్టణ యూనియన్ కార్యదర్శి వరలక్ష్మి, శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు, పట్టణ ఐద్వా నాయకులు బంగారు సునీత పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

ఓటరు జాబితా సవరణ వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి ఫారం 6, 7, 8 తీసుకొని పరిష్కరించడం, చనిపోయిన, శాశ్వతంగా వలస పోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం, పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందనగా చర్యలు తీసుకోవడం, 18ఏళ్లు నిండిన వారినందర్నీ ఓటర్లుగా చేర్చడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే పెండింగు దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు పాల్గొన్నారు.

అక్రమ ఓటు నమోదును అడ్డుకోండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇంటి నెంబరు లేకుండానే నమోదు చేస్తున్న అక్రమ ఓట్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు జిల్లా రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం డిఆర్ఒ కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నియోజక వర్గంలో బూత్ నెంబరు 1 నుండి 233 వరకు గల పోలింగ్ బూత్స్ నందు సుమారు 841 మంది ఓటర్లకు వారి వారి బూత్‌ల్లో హౌసు నెంబర్లు లేకుండా ఓటర్ల జాబితా ప్రచురించినట్టు తెలిపారు. గతంలో కూడా 0-0 తో ఓటర్లు నమోదైనట్లు గతంలో కూడా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసరు వారి దృష్టికి తీసుకొని వచ్చామని, కానీ నేడు కొత్తగా ప్రచురణ జరిగిన ఓటర్ల జాబితాలో 0-0 హౌస్ నెంబర్లుతోనే ప్రచురించడం జరిగిందని, కనుక సదరు ఓట్లను తొలగించి, వారి వారి హౌస్ నెంబర్లుతో కొత్త ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిందిగా కోరారు. కనుక తక్షణమే బూత్ లెవిల్ ఆఫీసర్లతో చర్చించి ఇటువంటి 0-0 డోర్ నెంబర్లు తొలగించి, వారి వారి హౌస్ నెంబర్లు నమోదు చేయించి ఓటర్ల జాబితాను సరిచేయాల్సిందిగా అధికారులను కోరారు.

ఒకటో తేదీకి సరుకులు అందించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం


డిసెంబర్ ఒకటి నుంచి ప్రతి గ్రామానికి ఉచిత రేషన్ సరుకులను ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ జె.రాములమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సేల్స్‌మెన్లు, డీలర్లు, వీఆర్‌ఒలు, ఎండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తమకు నిర్దేశించిన గ్రామాలకు ఎండియు ఆపరేటర్లు ఎన్ని అవాంతరాలొచ్చిన లబ్దిదారులకు రేషన్ సరుకులను అందించాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సేల్స్మెన్లు, డీలర్లు, విఆర్వోలదేనన్నారు. ఈ మేరకు గ్రామ విజిలెన్స్ కమిటీలకు తనిఖీల బాధ్యతను అప్పగిస్తున్నట్లు తెలిపారు. కార్డుదారుల దగ్గరకు వెళ్లి వేలిముద్రలను వేసుకొని అనంతరం ప్రభుత్వం అందించిన ఉచిత రేషన్ సరుకులను అందించాలన్నారు. అలాగే సరుకులు పంపిణీ బాధ్యతను జిసిసి గోదాం ఇన్చార్జిలేదని అన్నారు. సరుకులను సకాలంలో ఎండియు ఆపరేటర్లకు అందిస్తే సకాలంలో తమకు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లి సరుకులను అందిస్తారని అన్నారు. ఎక్కడైనా అవాంతరాలు వస్తే సివిల్ సప్లైస్ డిటికి గాని, తమ కార్యాలయానికి గాని సమాచారం అందించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, తదితరులు ఉన్నారు.

పథకాల కోసమే అప్పులు

సామాజిక సాధికార యాత్రలో ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర

ప్రజాశక్తి-పాలకొండ

అప్పు చేసిన డబ్బులు ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. శుక్రవారం సామాజిక సాధికార యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకు తమ ప్రభుత్వం అండగా ఉందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు, సామాన్యులైన తమను కూడా సమన్యాయంతో పదువులిచ్చి ఉన్నత స్థాయిలోకి తీసుకువచ్చారన్నారు. బాబు తెచ్చిన బ్రాండ్లు, బెల్టు షాపులు తప్ప.. తాము అధికారంలోకి వచ్చి ప్రజలకు వ్యతిరేకమైన పనులు చేయడం లేదన్నారు. ప్రజలకు పాదర్శకత పాలన అందిస్తున్నామని, ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా ప్రజలు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు చేరుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో అరాచాకాలు, తప్పుడు హామీలతో మోసం చేశారని, మరలా ప్రజలను నమ్మించి హామీలతో మోసగించాలని చూస్తున్నారన్నారని, పొత్తుల బాబును నమ్మవద్దు అన్నారు. వెనుకబడిన తరగతులకు అండగా వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే బస్సు యాత్ర ఉద్దేశమన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ బీసీలు, మైనార్టీలు, ఎస్సీలు, ఎస్టీలు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ విశాఖ రాజధాని ఏర్పాటైతే ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు జరుగుతుందని, అటువంటిది టిడిపి అడ్డుకుంటుందన్నారు. ఎన్ని కుయిత్తులు వేసినా విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగుల నాగర్జున మాట్లాడుతూ రెండోసారి కూడా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజలకు తమ ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అందిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు నియోజకవర్గంలో అభివృద్ధికి కార్యక్రమాలు జరుగుతున్నాయని, దీనిన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షులు పరీక్షిత్ రాజు, కురుపాం, రాజాం, పాతపట్నం, పార్వతీపురం ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కంబాల జోగులు, రెడ్డి శాంతి, అలజంగి జోగారావు, నియోజకవర్గ పరిశీలకులు గొండి కృష్ణమూర్తి, జిసిసి చైర్మన్ శోభాస్వాతి రాణి, శిష్టకర్ణ సంఘం కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనుషా, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్పీటీసీలు, పాలవలస దవళేశ్వరరావు, వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, లిల్లీ పుష్పనాథం, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చిన్నమంగళాపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా పట్టణంలోని ఆర్‌సిఎం స్కూల్ దగ్గర జరిగిన సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర వైసీపీ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.



సాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజలు అవస్థలు

వైసిపి సాధికరిత యాత్రతో ప్రజలు తీవ్ర అవస్థలు పాలయ్యారు. గురువారం సాయంత్రం నుంచే స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కోటదుర్గమ్మ ఆలయం వరకు రహదారి మీద రాకపోకలు నిలిపేశారు. దీంతో బస్సులను కూడా తిరగనివ్వలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు తీవ్ర అవస్థలకు లోనయ్యారు. చెక్ పోస్టు జంక్షన్ దగ్గర వాహనాలను నిలిపేయడంతో అక్కడ నుంచే ప్రయాణికులు అవస్థలు పడుతూ నడుచుకుంటూ గమ్యానికి చేరాల్సిన పరిస్థితి వచ్చింది.

దుర్మార్గం.. : టిడిపి

వైసిపి నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సు యాత్ర వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదురవ్వడం దుర్మార్గమైన చర్య అని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ అన్నారు. ఈమేరకు స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నల్లబెలూన్లు ఎగరేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాను స్థంభించి ఇటువంటి సమావేశాలు నిర్వహించడం అన్యాయమన్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని, ఇలాంటి దుర్మార్గమైన పనులు చేయరాదన్నారు. దళితులపై దాడులు చేస్తూ మృతదేహాలను ఇంటికి పంపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అక్రమాలను ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతున్నారని, ఇలాంటి పనులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్ కుమార్, చింత ఉమా తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీసు స్టేషన్ కొత్త భవనం ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని శనివారం డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించనున్నారు. రూ.2.4 కోట్లతో మక్కువ రోడ్డులో ఎంపిడిఒ కార్యాలయానికి సమీపాన పోలీసు స్టేషన్ భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని శుక్రవారం ఎఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ పరిశీలించారు. భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లపై కింద స్థాయి అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఇంఛార్జి డిఎస్పీ, సిఐలు ధనుంజయ రావు, సిహెచ్.శ్రీనివాసరావు ఉన్నారు.

గొయ్యిలు పూడ్చకుంటే ప్రమాదాలే...

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గొయ్యిలను పూడ్చకపోతే ప్రమాదాలు జరుగుతాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. పార్వతీపురం నుండి కూనేరు వెళ్లే అంతరాష్ట్ర రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గోతుల వద్ద మరమ్మతు పనులు చేపట్టి అటు వాహనదారులు, ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. మూడు రాష్ట్రాలకు వెళ్లే ఈ అంతరాష్ట్ర రహదారి మార్గంలో కొమరాడ గ్రామ సమీపంలో ఈశ్వరుని ఆలయం వద్ద, గుమడ, కోటిపాము, బంగారంపేట, ఇందిరానగరం, కూనేరు గ్రామాల వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజు అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే చిన్నచిన్న వాహనదారులు ప్రమాదాల బారినపడిన క్షతగాత్రులవుతున్నారన్నారు. కావున వెంటనే ఈ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రేషన్ కోసం 11 నెలలుగా ప్రదక్షిణలు

ప్రజాశక్తి- కలెక్టరేట్

తమ రేషన్ కార్డులో తమకు సంబంధం లేని వ్యక్తి పేరు చేర్చడం వల్ల తమ కుటుంబానికి గత 11 నెలలుగా ఉచిత రేషన్ అందడం లేదని కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన పిట్ట గౌరు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య, ఇద్దరు పిల్లలు కోడలితో కలిసి ఒకే రేషన్ కార్డులు ఉన్నామని. తమ కుటుంబానికి ఎటువంటి సంబంధం లేని పేర్లి రాము అనే వ్యక్తి తమ రేషన్ కార్డులో హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ కావడం, అతను ప్రభుత్వ ఉద్యోగిగా ఉండడంతో తమకు రేషన్ రాకుండా ఆగిపోయిందని తెలిపారు. ఈ విషయమై గ్రామ సచివాలయాన్ని, వాలంటీర్లను, తహశీల్దార్లను, సివిల్ సప్లై కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ రేషన్ కార్డులో మ్యాపింగ్ అయినా ఆ వ్యక్తిని తొలగించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరాడు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వలసబల్లేరు పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాలకు బిటి రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలసబల్లేరు పంచాయతీలో ఆవిరి రోడ్డు నుంచి వెలగమానుగూడ, వెలగమానుగూడ నుండి ఆగంగూడ వరకు రూ.2కోట్ల 35లక్షలతో 3కిలోమీటర్లు బిటి రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.కుసుమ, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ జి.సుజాత, మాజీ ఎంపిపి ఇందిరాకుమారి, మండల కన్వీనర్ గౌరీశంకర్, వైస్ ఎంపిపిలు రంగారావు, అన్నాజీరావు, ఎంపిటిసి సభ్యులు వి.కృష్ణకుమారి, జి.విద్యారాణి, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్ వెంకటరావు, వైసిపి నాయకులు షేక్ ఆదిల్, ఐ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఆడిట్ బృందాలతో సమన్వయం చేసుకొని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు సామాజిక ఆడిట్‌ను విజయవంతం చేయాలని ఎన్ఆర్ఇజిఎస్ రిసోర్స్ పర్సన్ ఎం.తిరుపతిరావు అన్నారు. స్థానిక మండల కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం ఎంపిపి శోభారాణి అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ 2020-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమాలు ఆరు బృందాలుగా 30 పంచాయతీల్లోనూ ఆడిట్ నిర్వహిస్తారని, వారికి క్షేత్ర సహాయకులు సహకరించాలని కోరారు. ఉపాధి హామీ పనులతో పాటు పంచాయతీరాజ్ సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించి రూ.20 కోట్లకు ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో నోడల్ టీం సభ్యులు ఎంఇఒ బి.జనార్దన్ నాయుడు ఆధ్వర్యంలో లోవ ముఠా ప్రాంతంలోని పలు పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ టీం సభ్యులు బొద్దిడి, చినవంకదార, సీమలవలస, అచ్చబ, చినగీసాడ, టంకు, పుసాబడి, రసాబడి పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను, వర్క్ బుక్స్, పాఠశాలల పరిసరాలను, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించిన జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే నాడు-నేడు నిధులు మంజూరైన పాఠశాలల్లో పని పురోగతి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల డిజిటల్ ఎడ్యుకేషన్ ఎలా చేపడుతున్నారో పరిశీలించారు. ఈ బృందంలో ఉపాధ్యాయులు బంటు సింహాచలం, రౌతు వెంకటరమణ, పి.శంకర్రావు, సిఆర్పి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

గ్లోబల్ వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి బి.ప్రజ్ఞ శుక్రవారం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ అనేది మానవ, జంతు, మొక్కలు, ఆహారం, పర్యావరణ రంగాల్లో ప్రధాన ప్రపంచ దేశాలకు ముప్పును సూచిస్తుందని అన్నారు. 2019లో దాదాపు 5 మిలియన్ల మరణాలు బ్యాక్టీరియా ఎఎంఆర్‌తో సంబంధం కలిగి ఉన్నాయని అంచనా వేయబడిందన్నారు. అందులో 1.27 మిలియన్ల మరణాలు ప్రత్యక్షంగా సంభవించాయన్నారు. 2015లో కొన్ని దేశాలు ఎఎంఆర్‌పై గ్లోబల్ యాక్షన్ ప్లాన్‌ను ఆమోదించాయని సమర్థవంతమైన కమ్యూనికేషన్, విద్య, శిక్షణ ద్వారా అవగాహన మెరుగుపరచడం దీని మొదటి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో 'జగనే మా నమ్మకం'

ప్రజాశక్తి - సీతానగరం


మండలంలోని బగ్గందొరవలసలో జగనే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో గ్రామానికి సంబంధించి ప్రభుత్వ పథకాలను డిస్‌ప్లే రూపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిందని, ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రభుత్వం జగన్ అని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బి.చిట్టిరాజు, జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాజ్జీ, సర్పంచ్ అధికార నారాయణరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పి.ఆమిటి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం లో ఎంపిపి కె. దీనమయ్య, జడ్పీటీసీ రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి. గిరిబాబు ఉన్నారు.

ఏజెన్సీలో వరిచేను దొంగలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో వరి చేను దొంగలు పడ్డారు. ఇళ్లు, బళ్ళు, దుకాణాలు చోరీ చేస్తున్న దొంగలు రైతులు పండించే పంటలను దొంగతనానికి పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని రేగలపాడులో కోతకు సిద్ధంగా ఉండే వరిచేనును కోసి పట్టుకుపోయారు. కేటుగాళ్లు చేనును చూడ్డానికి వెళ్లిన రైతుకు చేను కాదు కదా ధాన్యం గింజ కూడా లేకపోవడంతో అవాక్కవ్వడం ఆయన వంతైంది. బాధిత రైతు పృథ్వీ తెలిపిన వివరాల ప్రకారం రేగలపాడులో రెండున్నర ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను దుండగులు అపహరించారు. ప్రతిరోజు పొలానికి వెళ్లి పంటను పరిశీలించిన మాదిరిగానే శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి చూసేసరికి వరిచేను మొత్తం దొంగలు కోసుకుపోయారని గుర్తించారు. చేతికి అందిన పంటను దొంగలు దోచుకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



చోరీకి గురైన వరి ఎన్నులను చూపుతున్న బాధిత రైతు పృథ్వీ

సొగసు చూడ తరమా...

మినీ ట్రైన్, చిన్నపిల్లల బోటింగ్ ప్రత్యేకత



ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ప్రకృతి అందాలు పచ్చని పొలాలు తన ఒంపు సొంపులతో సోయగాలు కళ్లకు కనువిందు చేసేలా దర్శనమిస్తాయి. సీతంపేట అంటే ఠక్కున గుర్తొచ్చేది పర్యాటకం. పర్యాటకులు ప్రేమికులుగా సీతంపేట మారింది. ఎందుకంటే ఇక్కడ పర్యాటకం తెలంగాణ, ఒడిశా పరిచయం చేసుకుంది. ఎక్కడా లేని విధంగా పర్యాటక అభివృద్ధి చెందింది. ప్రతి ఏటా మూడు రాష్ట్రాల నుంచి లక్షా 50 వేల మంది పర్యాటకులు ఈ పార్కును సందర్శిస్తారు. జలపాతాలు ఒంపు సొంపులుగా కొండలు, వాహనాలపై వెళ్తుంటే కొండలు మన పక్కనుండే మనకన్నా ముందుగా వెళ్తున్నట్టు అనుభూతి కనిపిస్తుంది. మరోవైపు పచ్చని పొలాలతో కనువిందు చేస్తుంది.. కొండలపై జలపాతాలు పారుతుంటే వాటి సొగసులు కనిపిస్తాయి. ఇక కార్తీక మాసంలో పర్యాటకులకు సీతంపేట ఏజెన్సీ ఒక సందడిగా మారుతుంది. అయితే సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ ఏర్పాటుచేసి ఐదేళ్ల కావస్తుంది. సుమారు మూడున్నర కోట్లు వ్యయంతో అభివృద్ధి చేశారు. ఈ పార్కులో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఎంజాయ్ చేయడానికి అవకాశం కల్పించారు. ఎన్టీఆర్ అడ్వెంచర్ (పార్కులో అందాలను చూద్దాం) పార్కులో జల విహార వద్ద పర్యాటకులు బోట్ షికారు చేస్తారు. మరోవైపు వాహనాలు పక్కనుండే రైయ్ రైయ్ మంటూ వాహనాలు వెళ్తుంటాయి. మనపై నుండి స్కై సైకిల్ ఆకాశంలో చక్కెర్లు కొడుతుంటారు. అదే జలవిహారు అడ్డంగా హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నీటి మీద నడక నడుచుకుంటూ వెళ్తుంటారు. ఇదంతా జలవిహార్ మధ్యలోనే జరుగుతుంది. ఇది చూస్తేనే ఇంత అద్భుతంగా కనిపిస్తుంది. ఇక ఎంజాయ్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలి. మరో ప్రక్క క్లైమ్బింగ్ వాల్ యువకులు ఎక్కుతూ సాహసం చేస్తారు. మరికొంతమంది జెయింట్ విల్ లో ఉయ్యాల ఊగుతారు. వాటర్ రోల్‌లో జలవిహార్ వద్ద గుండ్రంగా తిరుగుతుంటే భూమి నీరు మన చుట్టూ మన వైపు తిరుగుతున్నట్లు నీటిమధ్యలో అనుభూతి వేరు. ఆల్ ట్రైన్‌లో పర్యాటకులు పార్కును చుట్టుముడతారు. ఇక చిన్నారులు కమాండ్ నెట్ మినీ ట్రైన్ వద్ద ఆడుకుంటారు. ఏడేళ్లలో పిల్లలకు మినీ ట్రైన్ చిన్నపిల్లల బోటింగ్లే తమాషాగా ఉంటుంది. ఫైవ్ డి థియేటర్ భయంకరమైన హర్రర్ పిక్చర్స్ డిజిటల్ సౌండ్‌తో యువకులు కేకలు చేస్తారు. కన్నులకు దగ్గరగా కనిపించే అబ్బురు పరిచే 3డి పెయింటింగ్స్ కనువిందు చేస్తాయి. యువతీ యువకులు ఆనంద విహార్ వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు చేస్తున్నారు. గిరి విహార వాహనంలో మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి అక్కడ అందమైన పగోడాలు కనవిందు చేస్తాయి. కొండలపై నుంచి జలపాతాలు జారుతుండడంతో జలపాతాల వద్ద జలకాలాడుతూ కేరింతలు కొడతారు. అదే వాహనంలో ఆడలి యు పాయింట్ చూస్తే హిరమండలం రిజర్వాయర్ కనిపిస్తుంది. ఎత్తయిన కొండలపై నుంచి పర్యాటక వాహనంలో ట్రావెలింగ్ చేస్తే ప్రకృతి సోయగాలు మన శరీరానికి తాకుతూ ఉంటాయి.



పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు వచ్చిన పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు, సేద తీర్చుకోవడానికి బెంచీలు ఏర్పాటు చేసాం. కొండలపై వెళ్లడానికి గిరి వాహనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తక్కువ ధరకే టికెట్ ఇస్తున్నాం.

ఎస్ రాజు,
మేనేజర్ ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్,
సీతంపేట.

వ్యాధుల పట్ల అప్రమత్తం : డిఐఒ

ప్రజాశక్తి -కొమరాడ

వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన చంద్రంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు, అందజేసిన చికిత్స వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. పిల్లల్లో, వృద్ధుల్లో శ్వాస సంబంధమైన సమస్యలు గుర్తిస్తే వెంటనే తగు చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కడ శిశువుల ఆరోగ్యం పరిశీలించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య తనిఖీ కార్డులు పరిశీలించి రక్తహీనత, బరువు తక్కువగా గుర్తించిన వారకి ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటున్నారా, లేనిదీ ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. మలేరియా, డెంగీ మొదలగు జ్వర లక్షణాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసి ఆ ప్రాంతంలో డ్రైడే, నివారణా చర్యలు పక్కాగా చేపట్టాలన్నారు. జెఎఎస్ రిఫరల్స్ చికిత్స కోసం అవసరమైన కార్యాచరణ పూర్తిచేయాలన్నారు. 104 వాహనం ద్వారా అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. అనంతరం అక్కడ గ్రామస్తులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. వాతావరణంలో స్వల్ప మార్పులు ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.శిరీష, సూపర్‌వైజర్లు విజయకుమారి, జయగౌడ్,వైద్య సిబ్బంది పార్వతి,అనూష, రామకష్ణ, అప్పలనాయుడు, 104 సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలకు పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - సాలూరు

ప్రజల సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార నిమిత్తం, ప్రజలు తమ సమస్యలు తెలియసేందుకు జిల్లా కేంద్రానికి రాకుండా, జిల్లా అధికారులే ప్రజలకు అందుబాటులో వచ్చేందుకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి 112 వినతులు రాగా, వాటిలో ఎక్కువగా ప్రజలు తమ గ్రామ సమస్యలు, బిటి రోడ్లు, గిరిజన, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం గురించి వినతులు అందజేశారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు, సూచనలు చేశారు. మండలంలోని మారయ్యపాడు కొండపై ఉండడం వల్ల రోడ్డు సదుపాయం లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తాడిలోవ నుండి మారయ్యపాడుకి తారు రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామ సర్పంచ్ బి.రామ్మూర్తి, గ్రామస్తులు అర్జీ అందజేశారు. అలాగే తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. బాగువలసకి పిహెచ్‌సికి నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని ఆర్.సురేష్ వినతి ఇచ్చారు. నెలిపర్తిలో సర్వేనెంబర్ 1-140, 141 గల భూమిని 40 కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూమికి డి-పట్టా మంజూరు చేయాల్సిందిగా ఎల్.ప్రసాద్, గ్రామస్తులు కోరారు. శివరాంపురానికి చెందిన వెలగాడ థెరిస్సమ్మ సర్వేనెంబర్ 144-1 విస్తీర్ణంలో 0.08 సెంట్లు జిరాయితీ భూమిని ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. గుమడాం గ్రామానికి చెందిన కె.నారాయణమ్మ డి-పట్టా, బంజారు భూమిని ఆక్రమించి, ఆ భూమిపై ఉన్న చెట్టును నరికి వ్యవసాయం చేసుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు. సాలూరుకు చెందిన ఎస్.శాంతమ్మ అసంఘటిత కార్మికుల బీమా మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు అందజేశారు. నెలపర్తికి చెందిన ఎం.వేలంగిని వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు. కరడవలస, కరడ కొత్తవలస, కొండ కొత్తూరు, సీడిబంద గ్రామాలో 12 విద్యుత్ స్తంభాలు వేయాలని కోరారు. డోయవరలో డిటిఆర్ ఫెయిల్ అయినందున కొత్త డిటిఆర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు తహశీల్దార్ బాలమురళీకృష్ణ, ఎంపిడిఒ జి.పార్వతి, మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న జెసి గోవిందరావు

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పాలకొండ

కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. పాలకొండలో కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించకుండా కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి ధరలను పెంచి, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్న బిజెపి విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలు, ప్రజాతంత్ర హక్కులపై దాడి ధర్నాలు నిరసనలపై నిర్బంధాన్ని ప్రజలంతా ఖండిస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక, రైతు సంఘాలు ఈనెల 27, 28న విజయవాడ జింఖానా గ్రౌండ్లో మహాధర్నా చేపట్టాలని, ఈ ధర్నాలో రైతులు, కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు మతోన్మాద విచ్ఛిన్నకర చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు నాయకులు దూసి దుర్గారావు, కాద రాము, వెన్నపు నారాయణరావు, బొడ్డుపల్లి పట్టాభి, మజ్జి వీరంనాయుడు, ఎస్.ప్రసాదు, ఎస్.వేణు, పి.భీమా, బి.కూర్మారావు, బి.వీరయ్య. బి.నరసింగరావు, కుప్పిలి శ్రీనివాసరావు, పి.ప్రసాద్, ఆర్.ఆనందు, డి.రాము, ఎల్.నారాయణరావు, గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ పిలుపునిచ్చారు. విజయవాడలో జరుగుతున్న ఈ మహా ధర్నా కు సంబంధించిన మండలంలోని సుంకి, నాగూరు, రావివలసలో శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కరణం రవీంద్ర, సింహాచలం ,సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని మారుమూల గ్రామాలైన మూలిగూడ, కొందుకుప్ప కానసింగి, బాతుగుడబ, మూల బిన్నిడి, గడి వంకర గిరిజన గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గిరిజనులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. గిరిజన అభివృద్ధి జరగాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మహిళా విభాగం నిర్వాహక కార్యదర్శి వెంపటాపు భారతి, క్లస్టర్ ఇంచార్జి దాసు, బూత్ ఇంచార్జి సుధాకర్, నాయకులు రామారావు, ధర్మారావు, అనిల్, సుధా, చిన్నారావు ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలు, షాపుల యజమానులను కలుసుకొని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు జి.రవికుమార్, సీనియర్ నాయకులు జి.వెంకటనాయుడు గురజాన చంద్రమౌళి, మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్ఞాన ప్రకాశరావు, వార్డెన్ అప్పారావు ఉన్నారు.

కల్వర్టు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామానికి సమీపంలో కుంబిడిగెడ్డపై ఉన్న కల్వర్టును మరమ్మతులు చేపట్టాలని మండలంలోని కె.ఇచ్ఛాపురం సర్పంచ్ బిడ్డిక గౌరు నాయుడు శుక్రవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ టి.రమణమూర్తి నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఏడేళ్ల కిందట అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారన్నారు. అయినా పనులు చేపట్టలేదన్నారు. నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై కల్వర్టు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని కోరారు.

రైతును పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - మక్కువ

తీవ్ర వర్షాభాగం కారణంగా చేతికి రావాల్సిన పంట చేలు చచ్చిపోయి నష్టాలతో అల్లాడుతున్న రైతులను వైసిపి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. మండలంలోని దబ్బగెడ్డ రెవెన్యూ పరిధిలో నష్టపోయిన వరి పంటను టిడిపి శ్రేణుల ఆధ్వర్యాన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకు వరి పంట నష్టాలను అధికారులు అంచనా వేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని గల అనుబంధ గ్రామాలు విజయరాంపురం, అనసభద్ర, మడవలస, బోరింగువలస గ్రామాలతో పాటు దబ్బ గడ్డ, కోన గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 150 ఎకరాల్లో వరి పంట నష్టపోయిందని, పంట పొలాలు పశువులకు ఆహారంగా మారాయని ఆమె తెలిపారు. పూర్తి వర్షాధార భూములు కావడంతో పెట్టుబడులు పెట్టి, పంట రాక రైతులు అప్పులు పాలవుతున్నారని ఆమె అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు, కార్యక్రమంలో స్థానిక మండల పార్టీ నాయకులు జి.వేణుగోపాలరావు, సీనియర్ నాయకులు ఎం.ప్రసాద్ రావు నాయుడు, సిహెచ్ తవిటినాయుడు, పి.మల్లేశ్వరరావు, స్థానిక నేతలు ఎం.శ్రీనివాసరావు, ఎల్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీలి రంగును విరివిగా ఉపయోగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, లేబరేటీల్లో నీలిరంగు, నీలం కాంతినిచ్చే రంగులు, వెలుగులను ఉపయోగించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీలిరంగు కాంతి యాంటీ యాంటీబయోటిక్స్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, పారాజెంట్స్ ను, సూక్ష్మ క్రిములను నశింప చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వ్యక్తిగత పరిసరాల, పరిశుభ్రత చాలా ముఖ్యమని. ప్రతి ఒక్కరూశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, ఉపాధ్యాయ బందం తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పంటల సాగే మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

వర్షాభావాన్ని తట్టుకునే ప్రకృతి సేద్య పంటల ప్రయోగం అడపాదప కురిసే కొద్దిపాటి వర్షాలతో లాభదాయకమైన సాగు విధానాలను రైతులు అవలంభించాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా మండలంలోని పాంచాలిలో వర్షాభావాన్ని తట్టుకుని రైతుకు ఆదాయాన్ని తెచ్చే నూతన మోడల్‌ను ప్రకృతి సేద్యం సిఆర్‌పి కె.తిరుపతినాయుడు ఆధ్వర్యాన శుక్రవారం వేయించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ ఈ మోడల్ అనంతపురం జిల్లాలో విజయవంతంగా నడుస్తుందని, మన జిల్లాలతో పోలిస్తే అనంతపురం జిల్లాలో సగం వర్షపాతం కూడా ఉండదని కావున ఇలాంటి కొత్త మోడల్స్ మరికొన్ని ప్రయోగాలు చేసి విజయవంతమైన మోడల్ రైతులకు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రయోగాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ దుర్గాప్రసాద్, తిరుపతి, ఎంటి శారద, డివిజనల్ యాంకర్ యశోదమ్మ, ఈ నూతన మోడల్ విధానాన్ని రైతులకు, కొత్తగా నియమించబడిన ప్రకృతి సేద్య బృందానికి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థులు, యువత రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. ఈ నెల 26న భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా పొందాలన్నారు. రాజ్యాంగ ఫలాలు పేదలకు అందేలా యువత ఆలోచన చేయాలని, సామాజిక బాధ్యతతో మెలగాలని కోరారు. జెవివి జిల్లా అధ్యక్షులు, డిఇఇ ఎం.రత్నకుమార్ మాట్లాడుతూ బాధ్యతతో చదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్‌కుమార్, ప్రిన్సిపల్ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెళకువలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఎంపిడిఒ కె.గీతాంజలి శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించడానికి కొన్ని మెళుకువలు నేర్పించారు. విద్యార్థులకు లక్ష్యం ఉంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. పదో తరగతి నుంచే మన జీవితంలో టర్నింగ్ పాయింట్ మొదలవుతుందని, పలు పోటీ పరీక్షలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు చదివేటప్పుడు ప్రణాళికలు ప్రకారం చదువుకుంటేనే విజయం తప్పనిసరిగా వరిస్తుందని అన్నారు. ఇప్పటి నుండే విద్యార్థులు ఏ కొలువు చేస్తామనే లక్ష్యం పెట్టుకుని చదువుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని జనరల్ నాలెడ్జ్ సంబంధించి విషయాలు తెలిపారు. ఆమె వెంట ఎంఇఒ ఆనందరావు, ప్రిన్సిపల్ తిరుపతి రాజు, ఉపాధ్యాయులు నీలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఇంటింటికి జనసేన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలంటే జనసేన, టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు అభ్యర్థించారు. మండలంలోని ఇరిడి పంచాయతీలో ఇంటింటికి వెళ్లి జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో ప్రజలు అన్ని రకాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గిరిజన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బిడ్డక పద్మావతి ఉన్నారు.

నేరాలు ఘోరాలు

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - సాలూరు

చదువుకోమని తల్లి మందలించిందని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని తోటవీధికి చెందిన మండల గౌతమ్(18) శుక్రవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని చెప్పారు.తల్లి వెంకటలక్ష్మి చదువుకోమని మందలించిందని గౌతమ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సాలూరు: పట్టణంలోని నెయ్యిలవీధికి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్ వ్యవహారంలో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.ఆ వీధికి చెందిన బండి పద్మ తన కుమార్తె కనిపించడం లేదని, తుపాకుల సంజయ్ అనే యువకుడిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈనెల 14 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామని సిఐ శ్రీనివాసరావు చెప్పారు.

హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష

సాలూరు: పట్టణంలోని బంగారమ్మ కాలనీ లో 2021లో భార్యని కిరాతకంగా హత్య చేసిన భర్త సొంపి లక్ష్మణరావుకు మహిళా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పిందని టౌన్ సిఐ సిహెచ్. శ్రీనివాసరావు చెప్పారు. విజయనగరంలోని మహిళా కోర్టు జడ్జి పద్మావతి తీర్పు ఇచ్చారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ బాబు ముద్దాయి కి శిక్ష పడేలా వాదనలు వినిపించారని చెప్పారు.